
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మైనర్ డ్రైవింగ్‌ను అరికడతాం

- విద్యా సంస్థల దగ్గర ప్రత్యేక డ్రైవ్
- ఎస్పీ సునీల్ షెరాన్



నంద్యాల టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టడమే లక్ష్యంగా నంద్యాల పోలీసులు పని చేస్తున్నారని ఎస్పీ సునీల్ షెరాన్ గురువారం పేర్కొన్నారు. ప్రతి వారంలో ఒక రోజు ప్రధాన సర్కిళ్ల వద్ద, పాఠశాలలు, కళాశాలల వద్ద మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలను నివారించడానికి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపిస్తున్నామన్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 607 కేసుల్లో సుమారుగా రూ.30,35,000 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

30,600 పొదుపు సంఘాలు

- రూ.1,550 కోట్ల రుణాలు లక్ష్యం
- అరకు కాఫీ షాపుల ఏర్పాటు
- అందుబాటులో చేపల పెంపకం యూనిట్లు
- డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

రుద్రవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 30,600 పొదుపు సంఘాలు ఉన్నాయని, వాటిలో 3.10 లక్షల మంది సభ్యులు ఉన్నారని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం రుద్రవరం వెలుగు కార్యాలయంలో క్లస్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ. 1,550 కోట్లు పొదుపు మహిళలకు రుణాలు మంజూరు లక్ష్యంగా ఉందన్నారు. వీటిలో ఇప్పటికే రూ. 697 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. పొదుపు మహిళలకు నాలుగు రకాల రుణాలు మంజూరు చేస్తామన్నారు. స్త్రీనిధి, ఉన్నతి (ఎస్సీ, ఎస్టీలకు), సీఐఎఫ్ పొదుపు రుణం ఇస్తామన్నారు. జిల్లాలో అరకు కాఫీ షాపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నంద్యాల, పాములపాడు, శ్రీశైలం, బనగానపల్లె మండలాల్లో పొదుపు మహిళల ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తామన్నారు. ఒక్కో షాపుకు రూ. 6లక్షలు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే కొత్తపల్లె మండలంలో చేపల పెంపకంతో ఉపాధి కల్పించడానికి యూనిట్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఒక్కో యూనిట్ రూ.5లక్షల రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటరు గోపాల్, ఏపీఎం వసంతకుమారి, చాగలమర్రి, ఆళ్లగడ్డ, శిరివెళ్ల మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

చాకిరేవు తిప్పకు వారసత్వ పత్రం

బనగానపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనా కాలంలో ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే చాలు.. భూకబ్జాదారులు రాబందుల్లా వాలిపోయారు. ఎక్కడెక్కడి భూములనూ యథేచ్ఛగా కాజేశారు. ఇప్పుడు అవన్నీ బయట పడుతున్నాయి. నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలోని అవుకు గ్రామ కంఠంలోని సర్వేనెంబర్ 839/ఏ1, ఏ3 లో గంగమ్మ ఆలయం వద్ద దాదాపు 15 ఎకరాల్లో ప్రభుత్వ స్థలం చాకిరేవు తిప్ప ఉంది. ఇందులోని పది సెంట్లకు ఓ మహిళ వారసత్వ హక్కు పత్రం సంపాదించుకుంది. ఆ తర్వాత కొడుక్కి రిజిస్ట్రేషన్ కూడా చేయించినట్లు తెలుస్తోంది.

అధికారం ఉంటే ఏ పనైనా చేయవచ్చని గత వైసీపీ ప్రభుత్వంలో రుజువైంది. జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములను పలువురు కాజేశారు. అలాంటిదే అవుకులో జరిగింది. అవుకు పట్టణానికి చెందిన ఓమహిళ ప్రభుత్వ స్థలమైన చాకిరేవు తిప్పలో 484 చదరపు గజాలు (10సెంట్లు) స్థలం వారసత్వంగా సంక్రమించినట్లు ఎన్‌వోసీ పత్రాన్ని సంపాదించింది. గతంలో అవుకు పంచాయతీ సెక్రటరీ జారీ చేసినట్లు ఉన్న ఎన్‌వోసీ పత్రంలో తేదీ లేదు. కర్నూలు జిల్లాగా ఉండటంతో నకిలీ పత్రాలు సృష్టించినట్లు అర్థమవుతోంది. 2022 ఏప్రిల్ నెల 4వ తేదీన జిల్లాల విభజన జరిగింది. దీన్ని బట్టి జిల్లాల విభజన జరగక ముందే ఈ పత్రాన్ని సంపాదించినట్లు తెలుస్తున్నది. ఆ పత్రాన్ని ఆధారంగా ఆమె తన కుమారుడికి 484 చదరపు గజాల స్థలాన్ని ఆస్తి సెటిల్‌మెంట్ దస్తావేజుగా 5సెంట్లు ప్రకారం రెండు డాక్యుమెంట్లు తయారు చేయించి గుట్టుచప్పుడు కాకుండ 2024 జూన్ నెల 14వ తేదీన బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించింది. వీటి డాక్యుమెంట్ నెంబర్లు 3843/2024, 3844/2024. ఈ విషయం ఇప్పుడు వెలుగు చూడటంతో చర్చనీయాంశంగా మారింది.

- అవుకు గ్రామ కంఠానికి చెందిన సర్వేనెంబర్ 839/ఏ1, ఏ3 పరిధిలో 78.73 ఎకరాల్లో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. బస్టాండ్ సర్కిల్‌లోని 30 పడకల ఆసుపత్రి వెనుక భాగంలో ప్రభుత్వ స్థలం చాకిరేవు తిప్ప 15 ఎకరాల్లో విస్తరించి ఉంది. అప్పటి ప్రభుత్వం 2019 డిసెంబరు నెలలో మత్స్యకారుల కోసం ఎస్‌డీపీ నిధులు రూ. 25 లక్షలతో చేపల మార్కెట్ విక్రయ కేంద్రాన్ని ఇక్కడ నిర్మించింది. ఈ తిప్ప సమీపంలోనే ప్రభుత్వ ఆసుపత్రితో పాటు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్లు ఉన్నాయి. ఇక్కడ సెంటు స్థలం విలువ రూ. 3 లక్షలు పైగానే ఉంది.

ప్రభుత్వ ఆస్తికి వారసత్వ పత్రం ఎలా

పంచాయతీ కార్యదర్శులు ఖాళీ స్థలాలకు ఎన్‌వోసీ మంజూరు చేసే అధికారాన్ని 2023 సెప్టెంబరు నెలలో రద్దు చేశారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి



ఆక్రమణకు గురవుతున్న చాకిరేవు తిప్ప ప్రభుత్వ స్థలం

- గ్రామ కంఠం భూమికి నకిలీ ఎన్‌వోసీ
- యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలకు రిజిస్ట్రేషన్లు
- వైసీపీ హయంలో ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు


NO OBJECTION CERTIFICATE

చాకిరేవు తిప్ప స్థలం వారసత్వంగా సంక్రమించినట్లు సృష్టించిన నకిలీ పత్రం

పేరుతో జారీ అయినట్లు ఉన్న ఎన్‌వోసీ పత్రంలో తేదీ, రౌండు సీలు లేకున్నా, కర్నూలు జిల్లాగా ఉన్నప్పటికీ గత ఏడాది జూన్ నెలలో బనగానపల్లె, అవుకు సబ్ రిజిస్ట్రార్‌లు రిజిస్టర్ చేయటం విస్తుకలిగించే అంశం. నిబంధనల ప్రకారం ఒక ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకొనే వ్యక్తి స్వయంగా డాక్యుమెంట్ పత్రాలను తయారు చేయకూడదు. ఇందుకు విరుద్ధంగా సదరు మహిళ కుమారుడే డాక్యుమెంట్ పత్రాలను తయారు చేసి గుట్టుచప్పుడు కాకుండా బనగానపలె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. అసలు ప్రభుత్వ స్థలానికి వారసత్వ హక్కును ఎట్లా కల్పించారనేది కీలక ప్రశ్న. ఆ మహిళ సంపాదించిన ఎన్‌వోసీ పత్రం ఒరిజనలా లేక నకిలీనా? అధికారులు నిగ్గు తేల్చాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలానికి కూడా రిజిస్ట్రేషన్

ప్రభుత్వ స్థలాలను, గ్రామ కంఠం భూములను సబ్ రిజిస్ట్రార్‌లు ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ కొందరు సబ్ రిజిస్ట్రార్‌లు కాసుల కోసం ప్రభుత్వ భూములను ఇలా రిజిస్ట్రేషన్ చేయడం దారుణం. ఇలాంటి సబ్ రిజిస్ట్రార్‌లపై కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు తీసుకుంటాం



అవుకు పట్టణంలో చాకిరేవు తిప్ప పేరుతో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంత స్థలం ఆక్రమణకు గురైనట్లు మా దృష్టికి వచ్చింది. ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గతంలోని అవుకు పంచాయతీ సెక్రటరీ జారీ చేసినట్లు ఉన్న ఎన్‌వోసీ పత్రంలో సంతకాన్ని ట్యాంపరింగ్ చేశారు. ఇందులో పంచాయతీ కార్యాలయం రౌండు సీలు లేదు. తేదీ లేదు. కర్నూలు జిల్లాగా అని ఉంది.

- హరిప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, అవుకు

కూటమి హయాంలోనే ముస్లింలకు న్యాయం

మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్ మౌలానా



నంద్యాల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే ముస్లిం, మైనార్టీలకు న్యాయం జరుగుతోందని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్ మౌలానా అన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇమామ్, మౌజమ్ గౌరవ వేతనాల బకాయిల చెల్లింపులకు సంబంధించి రూ.90 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. గురువారం ఆయన నంద్యాలలోని తన కార్యాలయంలో మాట్లాడారు. ఇమామ్‌ల వేతనం నెలకు రూ.10 వేల చొప్పున, మౌజమ్‌ల వేతనం రూ.5 వేలు చొప్పున విడుదల చేయడం జరిగింది. గతేడాదికి సంబంధించి ఏప్రిల్, మే, జూన్ ప్రస్తుత సంవత్సరం జనవరి నుంచి సెప్టెంబరు వరకు వేతనాల బకాయిలు రూ.90 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఇమామ్, మౌజమ్‌లకు బకాయిలు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేశ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

శాంతిభద్రతలే లక్ష్యం

- ఎస్పీ సునీల్ షెరాన్

గోస్పాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని ఎస్పీ సునీల్‌షెరాన్ పోలీసులను ఆదేశించారు. గురువారం ఆయన కోవెలకుంట్ల, గోస్పాడు, రేవనూరు పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. చట్ట పరిధిలో వారి సమస్యలను పరిష్కారమయ్యేందుకు కృషి చేయాలన్నారు. ప్రాపర్టీ కేసుల్లో రికవరీ శాతం పెంచాలన్నారు. గ్రామాల్లో గొడవలు, అల్లర్లు జరగకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, దీంతో పాటు సమస్యాత్మక గ్రామాల్లో నిఘా ఉంచాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఎస్పీ వెంట కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్, ఎస్ఐలు మల్లిఖార్జునరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎవరికీ సంతోషం లేదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

కర్నూలు న్యూసిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి పాలన వల్ల రాష్ట్రంలో ఎవరూ సంతోషంగా లేరని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ. ఈశ్వరయ్య విమర్శించారు. గురువారం సీఆర్ భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కే. రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి. రామచంద్రయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం రాకముందు ఒక మాట, వచ్చిన తరువాత ఒక మాట మాట్లాడుతూ ప్రజా వ్యతిరేకంగా తయారైందని అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్ని పరిశ్రమలు స్థాపించింది, ఎంత ఉత్పత్తి పెంచింది చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భూ బ్యాంక్ పేరుతో నియోజకవర్గానికి లక్ష ఎకరాలు గుర్తించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు కట్టపెట్టడం సరికాదని అన్నారు. చంద్రబాబు మోదీని పొడిగితే..మోదీ లోకేశ్‌ను పొగుడుతున్నారని ఎద్దేవా చేశారు. సీమలో సాగు నీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్. లెనిన్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కే.జగన్నాథం, రామక్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీకి నిస్వార్థంగా కష్టపడి పనిచేసే కార్యకర్తలే పట్టుకొమ్మలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం స్థానిక రాజ్ టాకీస్‌లోని టీడీపీ కార్యాలయంలో నూతనంగా ఏర్పడిన క్లస్టర్లు, యూనిట్, గ్రామ, బూత్ కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి రావడానికి పార్టీ అమలు చేస్తున్న క్లస్టర్ల, యూనిట్ వ్యవస్థ కీలక పాత్ర పోషించిందన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఈ వ్యవస్థ బాగా పని చేసిందన్నారు. పదవులు రాని వారు కూడా కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్, కొట్టాల శివనాగిరెడ్డి, ఏవీఆర్ ప్రసాద్, తాతిరెడ్డి తులసిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు..!

విద్యార్థులతో నీళ్లు మోయిస్తున్న ఉపాధ్యాయులు



బకెట్లతో నీళ్లు తీసుకెళ్తున్న విద్యార్థులు

ఉయ్యాలవాడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామ రెగ్యులర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులచే ఉపాధ్యాయులు నీళ్లు మోయిస్తున్నారు. గురువారం ముగ్గురు విద్యార్థులకు రెండేసి బకెట్లు ఇచ్చి నీళ్లు మోయించారు. పాఠశాలకు నీళ్లు రాకపోవడంతో పాఠశాల సమీపంలోని పొలాల వద్ద ఉన్న పంపుల వద్ద నుండి నీళ్లు మోయించారు. దీని విషయమై ఎంఈవో ప్రతాప్‌రెడ్డిని వివరణ కోరగా పాఠశాలలో మోటారు పని చేయడం లేదన్నారు.

కంబి యాత్రా నివాస్‌కు శంకుస్థాపన

- రూ. 200 కోట్లతో వసతి గదులు
- త్వరలో కృష్ణగిరి నుంచి శ్రీగిరికి రోప్ వే
- ఎమ్మెల్యే బుడ్డా



భూమిపూజ చేస్తున్న పీఠాధిపతితో ఎమ్మెల్యే, చైర్మన్

శ్రీశైలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో కర్ణాటక భక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు బస చేసేందుకు ఆధునిక సౌకర్యాలతో సుమారు రూ. 200 కోట్ల నిధులతో నిర్మించే కంబి యాత్రా నివాస్‌కు శంకుస్థాపన చేశారు. గురువారం శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రోజురోజుకూ శ్రీశైలానికి వచ్చే యాత్రికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ వసతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని చెప్పారు. అదే విధంగా కృష్ణగిరి నుంచి శ్రీగిరికి రోప్‌వే పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయని తెలిపారు. క్షేత్ర పరిధిలోని దేవదాయశాఖ, అటవీశాఖ మధ్య ఉండే సమస్యలు తొలగిపోయి మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రీశైల మండల ఇన్‌చార్జి యుగంధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

సింథటిక్ కలర్స్ వాడితే చర్యలు

ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటరాముడు



హోటల్స్‌లో తనిఖీ నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

నంద్యాల కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హోటళ్లలో ఆహారపదార్థాలకు సింథటిక్ ఫుడ్ కలర్స్, టెస్టింగ్ సాల్ట్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని నంద్యాల జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి వెంకటరాముడు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రాయలసీమ రుచులు, మా ఊరి విందు, స్టార్‌గార్డన్, హోటల్ సురభి, మహారాజా హోటల్స్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ హోటళ్లలో రెండు నమూనాలు సేకరించి హైదరాబాదులోని స్టేట్ ఫుడ్ లేబరేటరీకి పంపించామన్నారు. అక్కడి నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా ఎఫ్ఎస్ఐ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలో నంద్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఖాసింవలి తదితరులు పాల్గొన్నారు.

కుందూ వంతెన పునరుద్ధరణ

కలెక్టర్ రాజకుమారి



పాత వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి తదితరులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 13 : పట్టణ శివారులో శిథిలావస్థకు చేరిన కుందూ నది పాత వంతెనను పునరుద్ధరిస్తామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. గురువారం ఆమె ఈ వంతెనను జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీవో విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ శేషన్నలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాత వంతెన శిథిలావస్థకు చేరుకున్న దృష్ట్యా ప్రభుత్వం ఇప్పటికే నూతన వంతెన నిర్మాణానికి భూసేకరణ నిధులు విడుదల చేసిందన్నారు. కొత్త వంతెన పూర్తవడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని.. ఈలోగా రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పాత వంతెనను పునరుద్ధరిస్తామని అన్నారు. ఈ పనులు వారంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ వంతెనపై భారీ వాహనాలను అనుమతించమని అన్నారు.

'వంద శాతం లక్ష్యంతో ఉపాధి పనులు'

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన అన్ని పనులను వంద శాతం లక్ష్యం సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ పనుల పురోగతిపై ఏపీవోలు, ఏపీడీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని విభాగాల్లో ఉపాధి హామీ పనులు ముందంజలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో యావరేజ్ వేజ్ రేట్ పెరగడానికి హౌసింగ్, హార్టికల్చర్, సోక్‌పిట్స్ వంటి పనులను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తపల్లి, బండి ఆత్మకూరు, ఆళ్లగడ్డ మండలాలు తక్కువ శాతం పురోగతి సాధించాయని తెలిపారు. ప్రతి మండలంలో కనీసం వెయ్యి కుటుంబాలకు వంద రోజులు ఉపాధి కల్పిస్తే జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమన్నారు. జిల్లాకు 59 వేల కంపోస్ట్ పిట్స్ లక్ష్యం కేటాయించగా ఇప్పటి వరకు కేవలం 5 వేలు మాత్రమే పూర్తయ్యాయన్నారు. హార్టికల్చర్ పనుల్లో కూడా కేటాయించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



మాయమైపోతున్నడమ్మా.. మనిషన్నవాడు

దస్తగిరి ఆచారి మృతదేహం (ఫైల్)

- మంట కలిసిపోతున్న మానవత్వం
- పెరిగిపోతున్న హింసాత్మక ధోరణి
- అను'బంధాల'ను మరిచి.. క్షణికావేశాలకులోనై హత్యలు
- ఆప్తులను కోల్పోయి దుఃఖసాగరంలో బాధితులు

మనిషిలో మానవత్వం మంట కలుస్తోంది..
హింసాత్మక ధోరణి పెరిగిపోతోంది..
జీవనరాగం శృతి తప్పి.. బాంధవ్యాలు గతి తప్పాయి
స్వార్థం, ద్వేషం, అసూయ, ఈర్ష్య పెరిగి..
ప్రేమ, కరుణ, దయ, జాలి తగ్గి..
మనిషిని మృగంలా మార్చివేశాయి..
సాఫీగా సాగాల్సిన సంసార నౌక
అనుమానమనే పెనుభూతానికి మునిగిపోతోంది.
తలకొరి పెట్టాల్సిన చేతులే ఉరితాడు బిగించి,
కసాయిగా మారి కన్నతండ్రినే కడతేర్చి..
కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచేస్తున్నాయి.
స్నేహబంధం అన్ని బంధాల్లో కెల్లా అమూల్యమైనది..
అలాంటి బంధానికి సైతం చెదలు పట్టింది.
మద్యం మిత్రుడి హత్యకు ఊసిగొల్పింది..
ప్రాణ స్నేహితుడే కడతేర్చాడు..
ఏమిటీ ఘటనలు.. విషాదంలో ముంచెత్తే చర్యలు..
మానవుడా మేల్కో.. బంధాలను గుర్తించు..
అను'బంధాల'ను పంచి.. మంచి మనిషిలా జీవించు..!

కోడుమూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో మనిషన్న వాడు మాయమైపోతున్నాడు. స్వార్థం, ద్వేషం, కసి అనే ఎండమావుల వెంట పరుగు పెడుతూ చివరకు దుఃఖసాగరంలో మునుగుతున్నాడు. ఇటీవల జరిగిన దారుణ ఘటనలు చూస్తే సభ్య సమాజం ఎటువైపు వెళ్తుందోనని భయమేయక తప్పదు. అసలు ఏమైంది ఈ సమాజానికి.. మనిషి ఇలా మారడానికి కారణం ఎవరు? పరిస్థితులా.. సమాజమా.. విపరీత ధోరణా? ఇలా ఎన్నో ఆలోచనలు వస్తాయి.. రోజురోజుకు హింస పెరిగిపోతుంది. కసాయిగా మారుతున్న కొడుకులు.. అనుమానమనే పెనుభూతం కావడంతో కట్టుకున్న వాడినే కడతేర్చిన భార్య.. మద్యం మత్తులో మిత్రుడినే అనంత లోకాలకు పంపిన ఘటనలపై 'ఆంధ్రజ్యోతి' కథనం..



రోదిస్తున్న దస్తగిరి ఆచారి పిల్లలు (ఫైల్)

కారుణ్య నియామకం పొందేందుకేనా?



రామాచారి (ఫైల్)

కారుణ్య నియామకం పొందేందుకు ఓ తనయుడు తండ్రినే కడతేర్చాడు.. ఈ ఘటన ఇటీవల సంచలనం సృష్టించింది. కోడుమూరు మండలంలోని పులకుర్తి గ్రామానికి చెందిన రామాచారి (57) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రామాచారి, విరూపాక్షమ్మ దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు. రామాచారి తన కొడుకు కోసం ఇల్లు కూడా కట్టించాడు. కొడుకు వీరసాయి డిగ్రీ వరకు చదివాడు. కర్నూలులోని ఓ ఫార్మసీ దుకాణంలో పని చేసేవాడు. వీరసాయి ఎప్పుడూ అసంతృప్తితో ఉండేవాడు. తల్లిదండ్రులతో నిత్యం గొడవపడేవాడు. ఈ క్రమంలో సెప్టెంబరు 3వ తేదీ తెల్లవారుజామున నిద్రిస్తున్న తండ్రి రామాచారిని అతడు దారుణంగా హత్య చేశాడు. రోకలితో తల, ముఖంపై కొట్టి చంపాడు. అనంతరం తండ్రి పాదాలను పట్టుకుని క్షమించు నాన్నా అంటూ వేడుకోవడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ సమయంలో తల్లి లేదు. సోదరుడి ఆరోగ్యం బాగాలేకపోవడంతో పుట్టింటికి వెళ్లింది. అంతకు నెల రోజుల క్రితమే వీరసాయి భార్య సుప్రియ రెండో కాన్పు నిమిత్తం పుట్టింటికి చేరింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దారుణానికి ఒడిగట్టాడు కసాయి కొడుకు. భర్త మృతి, ఒక్కగానొక్క కొడుకు జైలుపాలు కావడంతో విరూపాక్షమ్మ జీవితంలో చీకట్లు అలుముకున్నాయి. మరోవైపు భర్త జైలుకెళ్లడంతో సుప్రియ మానసిక క్షోభ అనుభవిస్తోంది. వీరసాయి కారుణ్య నియామకం కోసమే ఇంతటి పని చేశాడని స్థానికులు అంటున్నారు.

మద్యం మత్తులో మిత్రుడినే..



గిరి (ఫైల్)

మద్యం మనుషుల జీవితాలనే నాశనం చేస్తోంది. మద్యం తాగి ఆ మత్తులో ప్రాణ స్నేహితుడినే మృత్యుదరి చేర్చాడు.. ఈ ఘటన మండలంలోని వెంకటగిరి గ్రామంలో ఇటీవలే చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గిరి, మౌలాలి ప్రాణస్నేహితులు. ఇద్దరిదీ దాదాపు ఒకే వయసు. ఇద్దరూ అవివాహితులు. స్నేహానికి కులాలు అడ్డుకాదని ఇద్దరి నమ్మకం. గిరికి ఓ సోదరుడు ఉన్నాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన వారిని మేనత్త పెంచింది. స్నేహితులైన గిరి, మౌలాలి కర్నూలులో జేసీబీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఇద్దరూ ఒకే గదిలో ఉంటున్నారు. సెప్టెంబరు 6వ తేదీన కోడుమూరులో ఓ వైన్‌షాపు వెనుక మద్యం తాగారు. ఆ సమయంలో ఏం జరిగిందో.. మౌలాలి కత్తితో గిరి(22)ని గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన గ్రామస్థులను కలవరపెట్టింది. హత్య ఎందుకు జరిగిందనే ప్రశ్న గ్రామస్థుల మదిలో మిగిలిపోయింది. ఏదిఏమైనా ప్రాణస్నేహితుడు మట్టిలో కలిసిపోగా, స్నేహం ముందు దోషిగా మిగిలాడు మౌలాలి. జైలుగోడల వెనుక ఉన్న మౌలాలిని మిత్రుడి జ్ఞాపకాలు శిక్షిస్తున్నాయి.

సంసార నౌకను మింగేసిన అనుమాన భూతం

జీవితాంతం కలిసిమెలసి ఉండాల్సిన భార్యాభర్తల బంధంలో ఒకరిపై ఒకరికి ప్రేమ, గౌరవం, నమ్మకం ఉండాలి. అప్పుడే ఆ బంధం హాయిగా సాగుతుంది. ఇందులో ఏది కొరవడినా సంసారం నడిసంద్రంలో నావలా మారుతుంది. మండలంలోని ప్యాలకుర్తి సమీపంలో దస్తగిరి ఆచారి హత్యకు గురయ్యాడు. దేవనకొండ మండలంలోని పీ కోటకొండకు చెందిన దస్తగిరి ఆచారి(38), వెంకటేశ్వరమ్మ దంపతులకు ముగ్గురు పిల్లలు. దస్తగిరి ఆచారి ఆటో, కారు డ్రైవింగ్ పనిచేస్తాడు. వెంకటేశ్వరమ్మ ఆశావర్కర్‌గా పనిచేసేది. భార్య ప్రవర్తనపై అతడికి అనుమానం ఏర్పడింది. ఇదే విషయంపై ఇద్దరూ గొడవ పడేవారు. చివరకు భార్య ఆశా ఉద్యోగాన్ని వదులుకుని మరోచోటకు వెళ్లి జీవనం సాగించసాగింది. కొన్నాళ్లకు పిల్లల కోసం భర్త, భార్యతో రాజీ అయ్యాడు. మళ్లీ కొద్దిరోజులకే ఇద్దరి మధ్య కలహాలు మొదలయ్యాయి. భార్యాభర్తల మధ్య గొడవకు కారణం గుర్తించి సరిదిద్దాల్సిన బావమరదులు అదుపుతప్పారు. బావను తీవ్రంగా కొట్టారు. అంతటితో ఆగకుండా అక్టోబరు 27వ తేదీ రాత్రి మద్యం తాగించి టవల్‌తో మెడ బిగించి దారుణంగా చంపేశారు. భార్య వెంకటేశ్వరమ్మ, బావమరదులు శేఖర్, వీరేష్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌ పంపారు. తండ్రి చనిపోవడం, తల్లి జైలుకు వెళ్లడంతో వారి ముగ్గురి పిల్లలు అనాథలయ్యారు.



దస్తగిరి ఆచారి (ఫైల్)

ఆది దంపతుల సేవలో పీఠాధిపతి



పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి దర్శించుకున్నారు. గురువారం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ ఈవో శ్రీనివాసరావు బిల్వమాల సమర్పించగా ప్రధానార్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసుకున్న పీఠాధిపతికి అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రం జ్ఞాపికను అందజేశారు.

మల్లన్న సన్నిధిలో హీరో నితిన్ దంపతులు

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ప్రముఖ సినీ నటుడు నితిన్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం వచ్చిన వీరికి ఆలయ రాజగోపురం వద్ద అధికారులు స్వాగతం పలికారు. అనంతరం నితిన్ దంపతులు స్వామి, అమ్మవార్లకు పూజలు చేసుకుని కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.



కార్తీక దీపాలు వెలిగిస్తున్న నితిన్ దంపతులు

కర్నూలు ఐఐఐటీడీఎం విద్యార్థులకు రూ.అరకోటి ప్యాకేజీతో కొలువు



విద్యార్థులను అభినందిస్తున్న కర్నూలు ఐఐఐటీడీఎం డైరెక్టర్ బీఎస్ మూర్తి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఐఐఐటీడీఎంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అత్యుత్తమ ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2025-26 క్యాంపస్ ఇంటర్వ్యూల్లో భాగంగా బీటెక్ సీఎస్ఈ బ్యాచ్‌కు చెందిన వెంకట మహేష్ రెడ్డి, నితీష్ కుమార్ ఇద్దరు విద్యార్థులు ఫిన్‌టెక్ సంస్థ సూపర్ మనీలో వార్షిక ప్యాకేజీ రూ.65 లక్షలతో ఉద్యోగాలను పొందారు. అలాగే బీటెక్ సీఎస్ఈ యు.పాండే అమేజాన్‌లో ఇంటర్న్‌షిప్ పొందడంతో పాటు మైక్రోసాఫ్ట్‌లో ఫుల్‌టైమ్ ఉద్యోగ ఆఫర్‌ను రూ.53లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపికయ్యారు. సీఎస్ఈలో ఇక్‌పార్ట్ బాత్ర 2027 బ్యాచ్ చెందిన లింక్డ్‌ఇన్‌లో ఇంటర్న్‌షిప్ సాధించారు. అత్యుత్తమ ప్యాకేజీతో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కర్నూలు ఐఐఐటీడీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, అధ్యాపకులు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ బృందం సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ పవన్ కుమార్, అసిస్టెంట్ ట్రైనీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ దీపక్, డాక్టర్ నోయేల్ నిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

బీ-ఫార్మసీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని జి.పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బీ.ఫార్మసీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 19వ తేదీ ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ (ఒరిజి నల్) రెండు సెట్లు ఫొటోస్టాట్ కాపీలతో నేరుగా హాజరు కావాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజు రూ.6,300 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 94418 25230ను సంప్రదించాలన్నారు.

టీజీ బ్లాక్ చానెల్‌కు గండి

- వంద ఎకరాల్లో నీట మునిగిన వరి పంట
- ఆందోళనలో రైతులు

రుద్రవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుంగ ప్రధాన కాల్వలో భాగమైన 22వ బ్లాక్ చానెల్‌కు టి. లింగందిన్నె పంట పొలాల సమీపంలో గండి పడినట్లు గురువారం రైతులు తెలిపారు. బ్లాక్ చానెల్‌లో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో వంద ఎకరాల్లో వరి పంట కోతల సమయంలో నీట మునిగిందని రైతులు వాపోయారు. ఒక్కో ఎకరాకు రూ. 30 నుంచి రూ. 35 వేలు పెట్టుబడి పెట్టామని, కోతలకు వీలు లేకుండా గండి నుంచి నీరు ప్రవహిస్తోందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి అంతా నీటి పాలైందని వాపోయారు.

వరి పంట నీటి పాలు

ఐదెకరాల్లో వరి పంట సాగు చేశా. కోతలు సమయంలో పంట నీటి పాలైంది. సాగు కోసం చేసిన ఖర్చంతా వృథా అయింది. మొత్తం వంద ఎకరాల్లో పంట నాశనం అయింది.

\- సుభాష్ రైతు, టి. లింగందిన్నె



22వ బ్లాక్‌చానెల్‌కు పడ్డ గండి

పంట అంతా నీటి పాలు

కోతకు వచ్చిన పంట చేతికి వచ్చే సమయంలో నీటి పాలైంది. పెట్టిన పెట్టుబడి వృథా అయిందని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. ఇలాగైతే వ్యవసాయం చేయడం కష్టం.

\- సుబ్బయ్య, రైతు, టి. లింగందిన్నె

రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారు

గంగ నీటిలో వరి పంట దెబ్బ తిన్నదని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కోతలు కోసేందుకు కూడా వీలు లేకుండా పొలాల్లోకి గండి నుంచి నీరు పారుతోంది.

\- రాముడు, టి. లింగందిన్నె




జిల్లా కేంద్ర గ్రంథాలయం

గ్రంథాలయాలు..

- 65 ఏళ్ల సేవలో కర్నూలు కేంద్ర గ్రంథాలయం
- డిజిటలైజేషన్‌తో పాఠకులకు అన్ని రకాల సేవలు
- నేటి నుంచి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విజ్ఞాన వారధులు

కర్నూలు కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఎంతో కీలక భూమిక పోషించిన ఘనత గ్రంథాలయాలకు దక్కుతుంది. చరిత్రను పరిశీలిస్తే ఆనాడు ఉద్యమకారులకు గ్రంథాలయాలు సమాచార కేంద్రాలుగా ఒకవైపు, అక్షరాస్యతా సాధనకు నిలయాలుగా మరోవైపు నిలిపారు. మారుతున్న కాలంలో సినిమా, టీవీ, మొబైల్ ఫోన్ల ప్రభావం గ్రంథాలయాలపై పడినా, వాటిని అధిగమించి నేటికీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పాఠకులకు విస్తృత స్థాయిలో సేవలు అందిస్తున్నాయి. మేధోవికాసాన్ని పెంపొందించే ఈ పఠనాలయాలను గుర్తిస్తూ ఏటా నవంబరు 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ గ్రంథాలయాల సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. పత్తికొండ, నంద్యాల, చాగలమర్రి తదితర ప్రాంతాల్లో నాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిల్చి ఉద్యమ బాటను పట్టించడంలో గ్రంథాలయాలు ప్రముఖంగా నిలిచాయి. స్వాతంత్ర్యానంతరం జిల్లా కేంద్రంలో గ్రంథాలయ సంస్థను, జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని 1959లో స్థాపించారు. పాతనగరంలోని గడియారం ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ సంస్థ ఆనాడు ఎల్ఎల్ఏ (లోకల్ లైబ్రరీ అథారిటీ) సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయం నడిచేది. కాగా 1972లో ప్రస్తుతం చిదంబరరావు వీధిలో ఉన్న స్వంత భవనంలోకి దీన్ని మార్చారు. ఎల్ఎల్ఏ నుంచి గ్రంథాలయాలు రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ కిందికి వెళ్లడంతో జిల్లా గ్రంథాలయ సంస్థగా పేరు మారింది. ఉమ్మడి జిల్లాలో 57 శాఖా గ్రంథాలయాలు, పుస్తక పఠన కేంద్రాలు పాఠకులకు నిత్యం అందుబాటులో ఉంటున్నాయి. ఇక కర్నూలు నగరంలో 65 ఏళ్లుగా జిల్లా కేంద్ర గ్రంథాలయం పాఠకులకు విస్తృత సేవలు అందిస్తోంది. శుక్రవారం నుంచి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయ సంస్థ అందిస్తున్న సేవలపై ప్రత్యేక కథనం.



పాఠకులకు అందుబాటులో లక్షలాది పుస్తకాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ ఉమ్మడి జిల్లాలో కొనసాగుతోంది. కర్నూలు జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీతో కలుపుకొని 58 శాఖా గ్రంథాలయాలు, ఒక గ్రామీణ గ్రంథాలయం, 133 పుస్తక నిక్షిప్త కేంద్రాలు (బీడీసీ)లతో సేవలు అందిస్తున్నాయి. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ ఇతర భాషలకు సంబంధించిన 55,169 పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంటున్నాయి. ఒక్క జిల్లా కేంద్రంలోనే పత్రికలు, రెఫరెన్స్, లెండింగ్ (పుస్తకాలు ఇంటికి ఇవ్వడం), ఇంటర్‌నెట్, సెర్చ్, స్టడీల్యాబ్ వంటి ఆరు విభాగాల్లో సేవలు అందిస్తోంది. జిల్లాలో 21 శాఖా గ్రంథాలయాలు సొంత భవనాల్లో కొనసాగుతుండగా, 22 అద్దె ప్రాతిపదికన, 17 రెంట్ ఫ్రీ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి.

పోటీ పరీక్షలకు కేరాఫ్‌గా



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగ యువత వివిధ పోటీ పరీక్షలు రాసేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో పెట్టారు. యువత పుస్తక పఠనం కోసం ఏసీ స్టడీ హాలు అందుబాటులో ఉండగా, సుమారు వంద మంది కూర్చొని చదువుకునే అవకాశం లైబ్రరీలో ఉంది. అలాగే ఈ స్టడీ హాలులో ఉదయం 8 నుంచీ రాత్రి 8 గంటల వరకు నిరుద్యోగులు చదువుకునే ఏర్పాటు చేశారు. పాఠకుల సౌకర్యార్థం జిల్లా కేంద్రంతోపాటూ కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, గోస్పాడు, ఆదోని, పాణ్యం, ఆలూరు, దొర్నిపాడు, నంద్యాల, డోన్, నందికొట్కూరు శాఖా గ్రంథాలయాల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు.

నేటి నుంచి వారోత్సవాలు ఇలా...

కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జేసీ నూరుల్ కామర్, మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు కేసీ కల్కూర, కేజీ గంగాధరరెడ్డిలు వారోత్సవాలు ప్రారంభిస్తారు. ఉమ్మడి జిల్లాలోని 57 శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయి. 20 వరకు జరిగే ఈ వారోత్సవాల్లో 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శనలు, అవగాహన సదస్సు, 16న గ్రంథాలయ యోధులపై ప్రముఖుల ప్రసంగాలు, 17న చిత్రలేఖన పోటీలు, కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు ప్రతిభా పోటీలు, ఆటల పోటీలు, 19న క్విజ్ పోటీలు, మహిళా దినోత్సవం, విభిన్న రకాల పోటీలు, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, సామూహిక స్వీయ పఠనం, బహుమతుల ప్రదానం, ముగింపు వేడుకలు జరుగుతాయి.



పుస్తకం హస్తభూషణం కావాలి


పుస్తకం హస్తభూషణం అంటారు. విద్యార్థులు దాన్ని నిజం చేయాలి. చేతిలో మంచి పుస్తకం ఎప్పుడూ ఉండాలి. నేడు సెల్‌ఫోన్ల మాయ నుంచి పిల్లలు బయట పడాలంటే పుస్తకం మాధుర్యం అర్థం చేయించడమే మార్గం. పుస్తకాలు కొనడానికి, చదవడానికి అందరికీ అందుబాటులో ఉండదు. ఆ కొరతను గ్రంథాలయాలు తీరుస్తాయి. బాల సాహిత్యం మొదలు పోటీ పరీక్షల వరకు ప్రముఖ రచయితలు రాసిన అన్ని రకాల సాహిత్య ప్రక్రియలకు చెందిన పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉచితంగా లభిస్తాయి. ఈతరం విద్యార్థులకు అసలు గ్రంథాలయాల గురించి అస్సలు అవగాహన లేదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలల విద్యార్థులను నెలకు ఒకసారి లేదా రెండుసార్లు గ్రంథాలయాలకు తీసుకువచ్చి చదివించడం అలవాటు చేయించాలి.



● డాక్టర్ ఎం.హరికిషన్, బాల సాహిత్య పురస్కార గ్రహీత

మధుమేహం.. అప్రమత్తం

- జిల్లాలో పెరుగుతున్న షుగర్ బాధితులు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు
- నేడు ప్రపంచ మధుమేహ నివారణ దినం



లక్షణాలు

- తరచుగా మూత్రం పోవడం
- అధిక దాహం.. అధిక ఆకలి
- చూపు మందగించడం
- బరువు తగ్గడం, గాయాలు మానకపోవడం

- తినకముందు 100 లోపు:
- మన దేశంలో చక్కెరస్థాయి పరగడుపున తినక ముందు 100లోపు ఉంటే మధుమేహం లేనట్లు భావించాలి.
- తిన్న రెండు గంటల తర్వాత చక్కెర స్థాయి 200 దాటితే షుగర్ ఉన్నట్లు నిర్ధారించవచ్చు.

కర్నూలు హాస్పిటల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'మా ఇంట్లో ఎవ్వరికీ షుగర్ వ్యాధి లేదు.. మేము కష్టపడే వాళ్లం.. మాలాంటి వాళ్లకు రాదు..' అనే మాటలు చెల్లవిక. ఇప్పుడు మధుమేహం సర్వసాధారణ వ్యాధి. ఎవరికైనా వస్తుంది. ప్రతి నలుగురిలో ఒకరు మధుమేహం బారిన పడుతున్నారు. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఈ వ్యాధి ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు చిన్న, పెద్ద తేడా లేకుండా అందరికీ వస్తోంది. మారిన ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిళ్లు, జీవనశైలిలో మార్పుల వల్ల మధుమేహం బారిన పడుతున్నారు. నవంబరు 14 వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫౌండేషన్ ఈ ఏడాది మధుమేహం-శ్రేయస్సు అనే నినాదాన్ని ఇచ్చింది.

మధుమేహం ప్రమాదకరమైన వ్యాధి. అనేక ఇతర వ్యాధులకు కారణమవుతుందని అంటారు. ఇందులో కొన్ని రకాలు ఉన్నాయి.

టైప్-01: ఆటోఇమ్యూన్ కారణంగా ఇన్సులిన్ లోపం వల్ల వస్తుంది.

టైప్-02: ఇన్సులిన్ నిరోధకత, జీవనశైలి కారణంగా గర్భధారణ మధుమేహం, గర్భధారణ సమయంలో వస్తుంది.

ఇతర రకాలు: జన్యు లేదా మందుల కారణంగా, ఊబకాయం వల్ల, వ్యాయామం లేకపోవడం, జంక్‌ఫుడ్, ఒత్తిడి, పొగ తాగడం, మద్యం సేవించడం వల్ల షుగర్ వస్తుంది.

పట్టణాల్లో ఎక్కువ..

జిల్లాలో షుగర్ వ్యాధి బాధితులు పట్టణాల్లో అధికంగా ఉన్నారు. పట్టణాల్లో 20 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 15 మంది బాధితులు నమోదవుతున్నారు. అసలు ఈ సమస్య ఉన్నట్లు తెలియని వారే ఎక్కువ మంది. ఏదైనా అనారోగ్య సమస్యతో వచ్చినప్పుడు, ఆపరేషన్ చేసే సమయంలో రక్తపరీక్షలు చేస్తున్నప్పుడు మధుమేహం ఉన్నట్లు బయటపడుతుంది. జిల్లాలో పీడియాట్రిక్‌తో బాధపడుతున్న వారు మరో 10 శాతం మంది ఉన్నారు. కర్నూలు జిల్లాలో 19.54 లక్షల జనాభా ఉండగా.. గత సెప్టెంబరులో ఎన్‌సీడీ 4.0 పరీక్షలు నిర్వహించగా.. 149 మందికి మధుమేహం ఉన్నట్లు గుర్తించారు.

ఈ వయసులో అధికం..

30-45 ఏళ్ల వయస్సులో ఉన్న వారిలో మధుమేహం ఇటీవల కాలంలో అధికంగా నమోదవుతుంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రకారం మన జనాభాలో ముఖ్యంగా యువతలో గతం కంటే ఇప్పుడు పది శాతం మధుమేహం పెరుగుదల కనిపిస్తుంది. పిల్లల్లో సైతం పెరగడం ఆందోళన కలిగిస్తున్నది.

కర్నూలు జీజీహెచ్‌కు క్యూ..

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో షుగర్ బాధితుల కోసం ప్రత్యేక ఎండోక్రైనాలజీ విభాగం ఉంది. ఈ విభాగానికి ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీగా డా.పి. శ్రీనివాసులు, అసోసియేట్ ప్రొఫెసర్ డా.పి. రాధారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా డా. సయ్యద్ హలీమ్‌తో పాటు రెండు డీఎం, పీజీ సీట్లు ఉన్నాయి. వారంలో ఓపీ ప్రతి మంగళ, శుక్ర వారాల్లో ఉంటుంది. ప్రతి ఓపీకి 250 నుంచి 300 మంది రోగులు వస్తుంటారు.



తెల్ల అన్నం మహా ప్రమాదం

వరి అన్నం తింటే చక్కెర స్థాయిలు విపరీతంగా పెరుగుతాయి. చిరుధాన్యాలు, కొర్రలు, దంపుడు బియ్యం, జొన్నరొట్టె తినాలి. ఆపిల్, బొప్పాయి, దానిమ్మ, చీనిపండ్లు తినవచ్చు. వ్యాధిగ్రస్తులు ప్రతిరోజు 45 నిమిషాలు వ్యాయామం చేయాలి. లేదా నడవాలి. ఆస్టియో బ్లాస్ట్ కణాలు సరిగ్గా పని చేయక, ఎముకలు బలహీన పడతాయి. కర్నూలు జీజీహెచ్‌లో డెక్సాస్కాన్ ద్వారా ఎముకల సాంద్రతను తెలుసుకుని చికిత్స చేయించుకోవాలి. **- డా.పి. శ్రీనివాసులు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, ఎండోక్రైనాలజీ విభాగం, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి:**



ప్రమాదాన్ని గుర్తించడం లేదు

షుగర్ వ్యాధిగ్రస్తులు పరిస్థితి విషమించే వరకు గుర్తించలేకపోతున్నారు. ఇటీవల 14 సంవత్సరాల పిల్లలు ఊబకాయం వల్ల షుగర్ వ్యాధి లక్షణాలతో ఆసుపత్రికి వస్తున్నారు. పిల్లల్లో వ్యాయామం తగ్గడం, టీవీ, సెల్ ఫోన్‌ల ప్రభావంతో వ్యాధికి గురవుతున్నారు. **- డా.పి. రాధారాణి, అసోసియేట్ ప్రొఫెసర్, ఎండోక్రైనాలజీ విభాగం, కర్నూలు జీజీహెచ్**



కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలి

మధుమేహంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా పనివేళల్లో ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. కొత్తగా వచ్చి టెక్నాలజీని ఉపయోగించుకుని షుగర్ వ్యాధి స్థాయిని తెలుసుకుని కంట్రోల్‌లో ఉంచుకోవాలి. పని ఒత్తిడిలో ఉండే వారు కొత్తగా చేతికి కట్టుకునే వాచ్‌లో మన ఆరోగ్యం హెల్త్ కండీషన్ వివరాలు తెలుసుకుని పని టైంలో కూడా జాగ్రత్త పడాలి. **- డా.బి. భరత్, ఎండోక్రైనాలజిస్టు, భరత్ హాస్పిటల్, కర్నూలు**

చిరుత దాడిలో ఆవు దూడ మృతి

ఆస్పరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొగలగల్ గ్రామంలో ఆవుదూడపై చిరుత దాడి చేసి చంపేసింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. వివరాలివి.. గ్రామానికి చెందిన ఈడిగ అహోబిలం అనే రైతు తన ఆవులను గ్రామ సమీప పొలంలో పశువుల పాకలో కట్టి ఉంచాడు. తెల్లవారుజామున వెళ్లి చూడగా చిరుతపులి దాడి చేసి సగం తిని కళేబరాన్ని వదిలేసింది. ఇది చూసిన రైతు బోరున విలపించాడు. మనుషులపై దాడులు జరగకముందే అటవీశాఖ అధికారులు చిరుతపులిని పట్టుకోవాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం..

- 20 పశువులకు గాయాలు

కొత్తపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో సింగరాజుపల్లె గ్రామంలో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. రాత్రి, పగలు తేడా లేకుండా పశువులపై పిచ్చికుక్క దాడి చేస్తుంది. గురువారం కూడా గ్రామంలో సుమారు 5 పశువులపై దాడి చేసిందని గ్రామస్థులు తెలిపారు. గత నాలుగు రోజుల నుంచి ఓ పిచ్చి కుక్క గ్రామంలో చొరబడి ఆవులు, గేదెలు, బర్రెలు ఎద్దులపై దాడి చేసిందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటి వరకు 20 పశువులపై దాడి చేసింది. గత మూడు నెలల క్రితం ఓ ఎద్దును పిచ్చికుక్క కరవడంతో పిచ్చిపట్టి చనిపోయిందని గ్రామస్థులు తెలిపారు. రెండు రోజుల క్రితం 4, బుధారం రాత్రి 7, గురువారం 5 పశువులపై దాడి చేసిందని గ్రామస్థులు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకుని పిచ్చికుక్క బెడద లేకుండా చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై పశువైద్యాధికారి అశోక్ కుమార్‌ను వివరణ కోరగా ప్రస్తుతం మావద్ద 100 డోసుల వ్యాక్సిన్ గ్రామానికి పంపించామని ఇవి ఒక్కో పశువుకు మూడు డోసులు వస్తుందని, రెండు డోసులు వేసేందుకు కర్నూలు నుంచి వ్యాక్సిన్ తెప్పించి వేయిస్తామని చెప్పారు.

విద్యార్థి గల్లంతు

పాములపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణనగర్ గ్రామ శివారులోని ఎస్సార్బీసీ కాలువలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయి విద్యార్థి గల్లంతయ్యాడు. గురువారం పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలివి.. క్రిష్ణనగర్ గ్రామానికి చెందన మొగిలీశ్వరప్ప, మల్లిక దంపతుల కుమారుడు వీరేశ్ పాములపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకెండియర్ చదువుతున్నాడు. గురువారం క్రిష్ణానగర్ గ్రామ శివార్లలోని ఎస్సార్బీసీ కాలువపై ఆరబోసిన మొక్కజొన్న గింజలకు కాపలాగా వెళ్లి నీటి కోసం కాలువలో దిగి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. పోలీసులు, బంధువులు పుట్టి ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

రుద్రవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలూరు గ్రామంలో గురువారం మిద్దె పనిచేస్తూ ప్రమాదవశాత్తు కింద పడి ఈశ్వరయ్య (30) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఈశ్వరయ్య మందలూరు గ్రామంలో బేల్దారి పని చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆయనను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు.

అప్పు చెల్లించమన్నందుకు దాడి

కర్నూలు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు చెల్లించాలని ఒత్తిడి చేస్తే.. లీలావతమ్మ అనే మహిళపై దాడి చేశారు. స్థానిక మారుతి బిగ్‌సిటీకి చెందిన లీలావతమ్మ వెంకటరమణ కాలనీకి చెందిన శ్రీలక్ష్మి, రామిరెడ్డి, భాగ్యమ్మలకు కొంత అప్పు ఇచ్చింది. ఆ అప్పు తిరిగి చెల్లించాలని కోరినందుకు తనపై దాడి చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

కర్నూలు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో చిన్నబజారి అనే వ్యక్తిపై వేధింపుల కేసు నమోదైంది. చిన్నబజారి తన బంధువుల్లోని ఓ యువతిని వాట్సాప్ ద్వారా బెదిరించినట్లు ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ గోపినాథ్ తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో రూ.9 లక్షలు మోసం

కర్నూలు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఇంటెలిజెన్సి చెందిన ఓ ఉద్యోగి ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా రూ.9 లక్షలు మోసపోయాడు. రియాజ్ అనే వ్యక్తి ఇంటెలిజెన్స్‌లో అసిస్టెంట్ ఎనాలసిస్ట్‌గా పని చేస్తున్నాడు. తనకు వాట్సాప్ ద్వారా ఆన్‌లైన్ ద్వారా వచ్చిన మెసేజ్‌లతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌ను నమ్మి నాలుగైదు కంపెనీలలో రూ.9 లక్షల మేర ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకు రూ.29 లక్షలు లాభం వచ్చిందని నమ్మించారు. తీరా డబ్బులు అడిగితే.. ఫోన్ రిసీవ్ చేసుకోకపోవడంతో మోసపోయానని గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలి

- గుంతకల్లు రైల్వే డీఎస్ఆర్‌పీ శ్రీనివాసాచారి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు దొంగలు పట్ల జాగ్రత్తగా ఉండాలని గుంతకల్లు రైల్వే డీఎస్ఆర్‌పీ (డీఎస్పీ) శ్రీనివాసాచారి అన్నారు. గురువారం ఆయన నంద్యాల రైల్వే పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైళ్లలో దొంగలు సాధారణ వ్యక్తులతో పాటు తిరుగుతూ చోరీలకు పాల్పడుతుంటారన్నారు. అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని ప్రయాణికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్పీ సర్కిల్ ఐఆర్‌పీ (సీఐ) శ్రీనాథ్‌రెడ్డి, డోన్ రైల్వే ఎస్ఐ బిందుమాధవి, నంద్యాల రైల్వే ఎస్ఐ కుమారి, ఆర్పీఎఫ్ ఐపీఎఫ్ (సీఐ) రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు ఫీజు వసూళ్ల నిర్లక్ష్యంపై విజిలెన్స్ ఆరా

కర్నూలు న్యూసిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని దుస్తుల దుకాణాలు, రెడిమేడ్, దుకాణాలు,



హోటల్స్, బార్ అండ్ రెస్టారెంట్లతో పాటు ఇతర వ్యాపారులకు సంబంధించి ట్రేడ్ లైసెన్సు, రెన్యువల్ ఫీజులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. 2018-2019 నుంచి 2020-2021 వరకు సుమారు రూ.2,29,64,990, 2021-2022 నుంచి 2024-2025 వరకు సుమారు రూ.3,09,58,449 పెండింగ్ ఉన్నట్లు తమ విచారణలో వెల్లడైందని అధికారులు తెలిపారు. ఈ మేరకు విజిలెన్స్ డీజీపీ కార్యాలయానికి సమాచారం పంపించినట్లు తెలిపారు. మొత్తం 2018-2019 నుంచి 2024-2025 వరకు రూ.5,39,23,439 పెండింగ్ ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు మొత్తం పెండింగ్‌లో నగర పాలక అధికారులు కేవలం రూ.1,37,74,450 మాత్రమే వసూలు చేసినట్లు వివరాలు సమర్పించారని తెలిపారు. తక్షణమే మిగిలిన రెన్యువల్ వివరాలు పంపాలని విజిలెన్స్ అధికారులు లేఖ రాశారు.

జోరుగా శనగ సాగు

- అదను దాటుతున్నా శనగ వైపే మొగ్గు
- జిల్లా సాధారణ సాగు 1.50 లక్షల ఎకరాలు
- గత ఏడాది 1.30 లక్షల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది 1.40 లక్షల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా



కొలిమిగుండ్ల మండలంలో సాగవుతున్న శనగ పంట

కొలిమిగుండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాలలో శనగ సాగు జోరుగా సాగుతోంది. మొంథా తుఫాన్ అనంతరం వానలు కాస్త తగ్గడంతో పొలాలు ఇప్పుడిప్పుడే తడి ఆరుతున్నాయి. రైతులు శనగ సాగు చేయడానికి సిద్ధమయ్యారు. అదను దాటుతున్నా అధిక సంఖ్యలో రైతులు పప్పు శనగ సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాలతో పాటు, కోవెలకుంట్ల, సంజామల, బనగానపల్లె, అవుకు తదితర ప్రాంతాలతో పాటు జిల్లా వ్యాప్తంగా రైతులు శనగ సాగును ఆరంభించారు. జిల్లాలో శనగ సాధారణ సాగు విస్తీర్ణం 1.50 లక్షల ఎకరాలు కాగా, గత ఏడాది 1.30 లక్షల ఎకరాల్లో అన్నదాతలు శనగ సాగు చేశారు. అయితే ఈ ఏడాది శనగ సాగు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. సుమారు 1.40 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. అయితే భారీ వర్షాలు మొంథా తుఫాన్ ప్రభావంతో శనగ సాగు భారీగా తగ్గే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. రబీ శనగ సాగుకు 15వ తేదీతో గడువు ముగుస్తుంది. అయినా రైతులు శనగ సాగు చేయడానికే ఆసక్తి చూపుతున్నారు. గత నాలుగు రోజులుగా తడి ఆరిన పొలాల్లో విస్తారంగా శనగ సాగు చేస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా పొలాల్లో అన్నదాతల కోలాహలం కనిపిస్తోంది. చాలా ఏళ్లుగా జిల్లాలో ముఖ్యంగా కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో రబీలో శనగ సాగుపైనే ఆసక్తి పెంచుకున్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి

సాగు గడువు ముగుస్తున్నందు వల్ల రైతులు శనగకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల వైపు మొగ్గడం మంచిదని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. తకువ ఖర్చుతో ఇతర పంటలు సాగు చేయడానికి అవకాశం ఉందని అంటున్నారు.



ఆరుతడి పంటలు సాగు చేయండి

రైతులు ఆరుతడి పంటలు సాగు చేయడం మంచిది. కొర్ర, కుసుమ, మినుము లాంటి పంటలు సాగు చేస్తే పెట్టుబడి తగ్గడంతో పాటు, మంచి లాభాలు ఆర్జించవచ్చు.
- శారదాదేవి, వ్యవసాయ అధికారి



10 ఎకరాల్లో శనగ సాగు చేస్తున్నాను

చాలా ఏళ్లుగా రబీలో శనగ పంటనే సాగు చేస్తున్నాను. వేరే పంట అలవాటు లేదు. ఈసారి పదెకరాల్లో శనగ సాగు చేస్తున్నాను.
-రాజేశ్వరరెడ్డి, రైతు నందిపాడు

చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలి

- జిల్లాలో పెరుగుతున్న షుగర్ బాధితులు
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ సిరి



కర్నూలు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి నుంచి • నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఈవోఆర్డీలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్లు, డీపీవో, డివిజనల్ పంచాయతీ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండకూడదని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న కౌశలం, ఈకేవైసీ, బయోమెట్రిక్ అప్‌డేషన్, వాహన్ ఆధార్ సీడింగ్ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్, హౌసింగ్ పీడీ చిరంజీవి, డీపీవో భాస్కర్, పబ్లిక్ హెల్త్ ఈఈ చంద్రమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కడప సెంట్రల్ జైలులో టీడీపీ నేత మృతి

- హత్య కేసులో జీవిత ఖైదుగా అరికట్ల చిన్న సుంకిరెడ్డి
- ఆరేళ్లపాటు కోవెలకుంట్ల మార్కెట్ యార్డు చైర్మన్‌గా సేవలు
- శిక్ష అనుభవిస్తూ గుండెపోటుతో మృతి



కోవెలకుంట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో కడప సెంట్రల్ జైలులో జీవితఖైదు అనుభవిస్తున్న కోవెలకుంట్ల మండలం భీమునిపాడుకు చెందిన మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఆరికట్ల చిన్న సుంకిరెడ్డి గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. ఆరికట్ల చిన్న సుంకిరెడ్డి (71) మృతదేహాన్ని సాయంత్రం స్వగ్రామం భీమునిపాడుకు తరలించారు. విషయం తెలుసుకున్న బంధువులు, టీడీపీ అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో భీమునిపాడులో విషాదచాయలు అలుముకున్నాయి. కాగా భీమునిపాడు ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న గ్రామం కావడంతో సీఐ హనుమంతనాయక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. భీమునిపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఆరికట్ల చిన్న సుంకిరెడ్డి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. టీడీపీకి సుంకిరెడ్డి అందించిన సేవలు ఎనలేనివని, ఆయన మరణం తీరని లోటు అన్నారు. సుంకిరెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు పార్టీ తరపున, వ్యక్తిగతంగా తాను అన్నివిధాలా తోడుగా ఉంటానని మంత్రి భరోసానిచ్చారు.

ఆధిపత్యం కోసమే ఫ్యాక్షన్

భీమునిపాడులో ఆరికట్ల పెద్ద సుంకిరెడ్డి, ఆరికట్ల చిన్న సుంకిరెడ్డి, ఆరికట్ల బాల సుంకిరెడ్డి ఉన్నారు. వీరికి సమీప బంధువు దుత్తల నరసింహారెడ్డి కూడా గ్రామస్తుడే. అయితే ఆరికట్ల చిన్నసుంకిరెడ్డి టీడీపీ నాయకుడిగా, దుత్తల నరసింహారెడ్డి వైసీపీ నాయకుడిగా గ్రామంలో పార్టీ కార్యక్రమాలు చూస్తుండేవారు. గ్రామంలోని శ్రీరామ ఆలయం, మాన్యం భూమి కౌలుకు తీసుకునే విషయంలో ఇద్దరికీ గొడవలు రావడంతో వారి మధ్య ఫ్యాక్షన్ తలెత్తింది. దుత్తల నరసింహారెడ్డి గ్రామంలో ఆధిపత్యం కోసం టీడీపీకి చెందిన ఆరికట్ల బాల సుంకిరెడ్డిని 27-1-2000 సంవత్సరంలో హత్య చేశాడు. ఆ కేసులో దుత్తల నరసింహారెడ్డికి 2005లో ఏడు సంవత్సరాల జైలుశిక్ష పడింది. అయితే దుత్తల నరసింహారెడ్డి 2008లో హైకోర్టులో కేసు కొట్టివేయించుకుని బయటికి వచ్చి కొలిమిగుండ్ల మండలం ఎర్రగుడిలో ఉండేవాడు. 2010 సంవత్సరంలో అప్పటి బనగానపల్లె వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో భీమునిపాడుకు చేరుకుని రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ గ్రామంలో ఆధిపత్యం కోసం ప్రయత్నించేవాడు

ఇదిలా ఉండగా ఆరికట్ల చిన్న సుంకిరెడ్డి 1993 నుండి 1996 వరకు కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు చైర్మన్‌గా పనిచేశారు. అలాగే రెండోసారి 2010 నుండి 2013 వరకు కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు చైర్మన్‌గా పనిచేసి ఈ ప్రాంత ప్రజలకు రైతులకు సేవలందించారు. అయితే గ్రామాధిపత్యం కోసం మరోవైపు దుత్తల నరసింహారెడ్డి పోరాటం కొనసాగిస్తునే ఉన్నారు. ఈ తరుణంలో టీడీపీకి చెందిన అరికట్ల చిన్న సుంకిరెడ్డి అతని కుమారుడు సురేంద్రరెడ్డి మరికొందరితో కలిసి 10-5-2013న రేవనూరు పోలీసుస్టేషన్ పరిధిలోని కలుగొట్ల ఆర్‌అండ్‌బి రహదారిలో ప్రత్యర్థి దుత్తల నరసింహారెడ్డిని హత్య చేశారు. ఆ కేసులో వారికి జీవితఖైదు శిక్ష పడింది. ఆరికట్ల చిన్న సుంకిరెడ్డి, ఆరికట్ల సురేంద్ర రెడ్డి, సురేశ్‌రెడ్డి, మాల బాలస్వామి, మాదిగ సుబ్బరాయుడు కడప సెంట్రల్ జైల్లో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్నారు. వారిలో ఒకరైన ఆరికట్ల చిన్న సుంకిరెడ్డి గురువారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకి వెళ్లి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం భీమునిపాడుకు తీసుకువచ్చారు.

రైతులు దళారులను నమ్మొద్దు..

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం రైతుబజార్లను ఏర్పాటు చేసిందని అందువల్ల పొలాల్లో వారు పండించిన కూరగాయలను దళారులకు అమ్మి నష్టపోకుండా రైతుబజార్లకు నేరుగా తీసుకువచ్చి అమ్ముకోవాలని సి.క్యాంపు రైతుబజార్ హార్టికల్చర్ అధికారి శివకుమార్ కోరారు. గురువారం కర్నూలు నగర పరిధిలోని భూపాల్‌నగర్, నందనపల్లె, పడిదెంపాడు, మిలిటరీ కాలనీతో పాటు తదితర గ్రామాల్లో సీ.క్యాంపు రైతుబజార్ హార్టికల్చర్ అధికారి శివకుమార్ పొలాల్లో రైతులు పండించిన పంటలను పరిశీలించారు. దళారులు గ్రామాలకే వెళ్లి రైతులను మోసపూరిత మాటలతో నమ్మించి తక్కువ ధరకే కూరగాయలను కొనుగోలు చేస్తున్నారనీ వాటిని రెట్టింపు ధరకు రైతుబజార్లలో వినియోగదారులకు అంటగడుతున్నారనీ దీని వల్ల రైతులు, ప్రజలు నష్టపోతున్నారన్నారు. రైతుబజార్లలో నాణ్యమైన కూరగాయలను తక్కువ ధరకే ప్రజలకు అందిస్తున్నామన్నారు.

మహిళా సమాఖ్య కమిటీ ఎన్నిక

ఆత్మకూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీ మహిళా సమాఖ్య మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రజిత ఆధ్వర్యంలో జరిగిన ఈఎన్నికల్లో అధ్యక్షురాలిగా లక్ష్మీరత్నమ్మ, కార్యదర్శిగా ముర్తుజాబీ, కోశాధికారిగా మౌలాబీ, ఉపాధ్యక్షులుగా జమ్ములమ్మ, శిరీషాబాయి, సహాయకార్యదర్శిగా లక్ష్మీదేవి, నాగేశమ్మను ఎంపికచేశారు. సీపీఐ మండల కార్యదర్శి ప్రతాప్ ఉన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

పాణ్యం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఆర్జీఎం కళాశాల సీఎస్ఈ విభాగం అధ్యాపకుడు సంపత్‌కుమార్ డాక్టరేట్ పొందినట్లు ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 12న కర్నూలు ఆర్‌యూ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, వీసీ బసవరావు డాక్టరేట్ పట్టాను అందించారన్నారు. 'ఎనర్జీ ఎఫిషియన్ రూటింగ్ స్ట్రాటజీ ఫర్ లార్జ్‌స్కేల్ వైర్‌లెస్ సెన్సార్ ఇన్ హీటరోజీనియస్ నెట్ వర్క్' అంశంపై పరిశోధన చేసినందుకుగాను డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. కళాశాల ఛైర్మన్ శాంతిరాముడు, ఎండీ శివరాం, డైరెక్టర్ అశోక్‌కుమార్, హెచ్‌వోడి సుబ్బారెడ్డి సంపత్‌ను అభినందించారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందచేత

పాములపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకులమ్మ కొట్టాలకు చెందిన పల్లె ప్రసాద్ అనే దివ్యాంగుడికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వీల్‌చైర్ అందించారు. గురువారం స్థానిక టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి అభ్యర్థన మేరకు నంద్యాల టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే స్పందించారు. గంటల వ్యవధిలోనే దివ్యాంగుడికి వీల్‌చైర్ అందించారు. దివ్యాంగుడు, టీడీపీ నాయకులు, గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నంద్యాల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రైల్వే స్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంకు అనుకుని ఉన్న గోడ పక్కన గుర్తు తెలియని వ్యక్తి గురువారం మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ కుమారి తెలిపారు. వివరాలు.. చనిపోయిన వ్యక్తి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉండవచ్చని, చేతికి వాచ్, మెడలో తవాల్, బ్లూకలర్ చొక్కా ధరించి ఉన్నాడు. ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పదవులంటే ఓ బాధ్యత

- కార్యకర్తలకు సముచితస్థానం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి
- ఏడాదిన్నరలోనే రూ.200 కోట్లతో అభివృద్ధి
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పదవులంటే ఓ బాధ్యతని, పార్టీలో పదవులు దక్కించుకున్న వారందరు సేవాభావంతో పనిచేయాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంఅండ్‌ఎం ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ఆయా మండలాల టీడీపీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ స్థాయి కమిటీల ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బుడ్డా పార్టీ జెండాను ఆవిష్కరించారు. దివంగత ఎన్టీఆర్, బుడ్డా వెంగళరెడ్డి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. నూతన కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలో పనిచేసే కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందన్నారు. ఏడాదిన్నరలోనే రూ200 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం సత్తా చాటేలా కార్యకర్తలు సమన్వయంగా మెలగాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం చేస్తున్న మేలేంటో ప్రజలకు వివరించాలన్నారు. నూతనంగా ఎన్నికైన ఆయా మండలాల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ కమిటీ ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ వంగాల కృష్ణారెడ్డి, మహానంది ఎంపీపీ యశస్వినీ, ఆయా మండలాల అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, రవీంద్రబాబు, వేణుగోపాల్, అబ్దుల్‌కలాం, కృష్ణారెడ్డి, శివవంకర్, మాజీ మండలాధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, శ్రీశైలం బోర్డు సభ్యులు భరద్వాజశర్మ, గంగమ్మ, సొసైటీ ఛైర్మన్ షాబుద్దీన్, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ నజీర్‌అహ్మద్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా ఉన్నారు.

మార్కెట్ ఆదాయం పెంచేలా కృషి

- మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గీత



మాట్లాడుతున్న మార్కెట్ యార్డు ఛైర్ పర్సన్ గీత

పాణ్యం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డు ఆదాయం పెంచేలా కమిటీ కృషిచేయాలని మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అంగజాల గీత అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025జూన్ నుంచి ఆగస్టు వరకు మార్కెట్ ఆదాయం రూ. 8,85,313 కాగా ఖర్చు రూ.30,17,096 చేసినట్లు తెలిపారు. ఈఏడాది ఖరీఫ్ ధాన్యాన్ని యార్డులోని రెండు గోదాముల్లో నిల్వ ఉంచేలా చర్యలు చేపడతామన్నారు. ధాన్యం అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టులు ఏర్పాటుచేస్తామని అన్నారు. యార్డులో నిర్మాణంలో ఉన్న నూతన గోదాము నిర్మాణాన్ని పూర్తిచేయడానికి చర్యలు చేపడతామన్నారు. యార్డు ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, యార్డు కార్యదర్శి రెహమాన్, సభ్యులు ఉషారాణి, షణ్ముఖ, సుధాకర్, సంగటి ప్రభాకర్, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణ యాదవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సంతృప్తికర సేవలందించాలి

- న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



వినతులను స్వీకరిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యలకు సంబంధించి కార్యాలయాల దగ్గరకు వచ్చే ప్రజలకు సంతృప్తికరమైన సేవలందించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులకు సూచించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నంద్యాల నియోజకవర్గం నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. వినతులు స్వీకరించిన మంత్రి సంబంధిత అధికారులను సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

శ్రీశైలంలో అనుసంధానం హర్షణీయం

కాకనూరు శారదా పీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామిజీ



కొలనుభారతి అమ్మవారిని దర్శించుకున్న శివయోగేంద్ర సరస్వతి స్వామిజీ

కొత్తపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నల్లమలలో కొలువైన జ్ఞాన సరస్వతి క్షేత్రమైన కొలనుభారతి అమ్మవారిని శ్రీశైలం క్షేత్రానికి అనుసంధానం చేయడం హర్షణీయమని కాకనూరు శారదా పీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామిజీ అన్నారు. గురువారం ఆయన కొలనుభారతి అమ్మవారిని శిష్యబృందంతో కలిసి దర్శించుకుని అమ్మవారికి అభిషేకాది క్రతువుల్లో పాల్గొన్నారు. స్వామిజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని శ్రీశైలలో అనుసంధానం చేయడంతో భక్తుల సంఖ్య రోజురోజుకు పెరిగి క్షేత్రాభివృద్ధి జరుగుతుందన్నారు. రహదారి, నిలిచిపోయిన అమ్మవారి క్షేత్ర నిర్మాణాన్ని పూర్తి చేయాలి. ఛారుగోషిణి నదిని విస్తరించాలని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. పురోహితులు ఇష్టానుసారంగా విధులకు హాజరు కావడంపై స్వామిజీ మండిపడ్డారు. ఉదయం 7 గంటలకు గుడి తలుపులు తెరిచి అమ్మవారికి 8గంటలలోపు అభిషేకాది క్రతువులు పూర్తి చేసి భక్తుకు దర్శనం కల్పించాల్సి ఉందన్నారు. 8.20గంటలకు పురోహితులు వచ్చి 9.20గంటలకు అభిషేకాలు నిర్వహించి అమ్మవారి దర్శనం కల్పించడం భక్తుల మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు.

'శాంతిరాం'కు పేటెంట్లు మంజూరు



మాట్లాడుతున్న ఐపీఆర్ బృందం సభ్యులు

పాణ్యం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలకు 'కపిలా 2' కింద 30 పేటెంట్లు దక్కినట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత ప్రభుత్వం, విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, ఏఐసీటీఈ సంయుక్తంగా ఈపథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో మేథో సంపత్తి హక్కులు (ఇంటలెక్చర్ ప్రాపర్టీ రైట్స్), ఆవిష్కరణలను ప్రోత్సహించడమే ఈపథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈపథకం కింద కళాశాలకు వివిధ విభాగాల నుంచి 30 పేటెంట్ ప్రతిపాదనలకు ఆమోదం లభించిందన్నారు. ఈ సాధనకు కృషిచేసిన డీన్ జి.సౌమ్య, కపిలా కోఆర్డినేటర్ షర్మిలాదేవిని కళాశాల అధ్యాపక బృందం, హెచ్‌వోడీలు, ఐపీఆర్ బృందం అభినందించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గడివేముల/ నంద్యాల కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నంద్యాలలో సైతం నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని గ్రందాలయ ఇన్‌చార్జి శ్రీధర్ తెలిపారు.14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న ప్రముఖులను స్మరించడం, 17న ఆటల పోటీలు, 18న వ్యాసరచన పోటీలు, 19న ఇందిరా గాంధీ జయంతి, 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈవారోత్సవాలను విద్యార్థులు, ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

గడివేముల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని డిప్యూటీ సీఈవో ఈవీ సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ, రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ప్రజాదర్బార్‌లో ప్రజలు ఇచ్చే అర్జీలను పరిశీలించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలపై నివేదికలు తయారుచేసి పంపించాలన్నారు. ఎంపీడీవో వాసుదేవగుప్త, తహసీల్దార్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో ఈవీ సుబ్బారెడ్డి

కోటి దీపోత్సవానికి సర్వం సిద్ధం



కోటి దీపోత్సవానికి ముస్తాబైన వేదిక

శ్రీశైలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా స్వామిఅమ్మవార్లకు ప్రీతికరమైన శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రధాన వీధిలో కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించుటకు సర్వం సిద్ధం చేసినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇప్పటివరకు సుమారు 2500మంది మహిళలు రిజిష్ట్రేషన్లు పూర్తి అయినప్పటికీ మరి కొంతమంది భక్తులు కూడా పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం ప్రారంభమయ్యే కార్యక్రమానికి డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు కోటిదీప ప్రజ్వలన విశేషాలను తెలుపనున్నారు. ప్రముఖ నాట్యకళాకారిణి కుమారి లిక్షితాశ్రీ బృందం వారిచే నాట్యప్రదర్శన, దీపోత్సవం జరిపించి స్వామిఅమ్మవార్లకు దశహారతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పద్మశ్రీ పురస్కార గ్రహిత సహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మచే శ్రీశైల క్షేత్రం - కోటిదీపోత్సవం అనే అంశంపై దివ్య ప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈవోతో పాటు ఛైర్మన్ రమేష్‌నాయుడు ఈఈ నర్సింహరెడ్డితో కలిసి దీపోత్సవ వేదిక, భక్తులు కూర్చుని దీపాలు వెలిగించుటకు జరుగుతున్నఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. శ్రీశైలంలో తొలిసారి నిర్వహించనున్న కోటి దీపోత్సవ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి యాత్రికులు వస్తున్నారని ఛైర్మెన్ తెలిపారు. దీపోత్సవ కార్యక్రమాన్ని శ్రీశైలటీవీ యూట్యూబ్ ఛానల్ ద్వార ప్రత్యక్ష ప్రసారం చెయ్యనున్నట్లు ఈవో తెలిపారు.

మొక్కజొన్నను ప్రభుత్వమే కొనాలి



కొత్తపల్లిలో రైతులు ఆరబోసుకున్న మొక్కజొన్న పరిశీలిస్తున్న వైసీపీ నాయకులు, రైతులు

కొత్తపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలని వైసీపీ రైతు విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గౌరు జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన వైసీపీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు, రైతులతో కలిసి కొత్తపల్లి గ్రామ శివారులో రైతులు ఆరబోసుకున్న మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. తహసీల్దార్ ఉమారాణికి వినతి పత్రం అందజేశారు. నాయకులు మహ్మద్‌గౌస్, నాగలక్ష్మిరెడ్డి, రవీంద్ర రెడ్డి, లింగారెడ్డి, రహంతుల్లా, చింతమాను శ్రీనివాసులు, పరుశురాముడు, మహబూబ్ బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

17న జాబ్ మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, ప్రిన్సిపాల్

నందికొట్కూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగమునితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈమేళాకు 10 ప్రైవేటు కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. నిరుద్యోగ యువత ఈఅవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 91548 30286, 7673902328 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

- ఎస్పీ సునీల్‌షెరాన్
- గోస్పాడు, రేవనూరు స్టేషన్ల తనిఖీ



గోస్పాడు పోలీసుస్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సునీల్ షెరాన్

గోస్పాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని ఎస్పీ సునీల్‌షెరాన్ ఆదేశించారు. గురువారం రాత్రి ఆయన గోస్పాడు, రేవనూరు పోలీస్‌స్టేషన్లను, వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్లలో గ్రేవ్, పెండింగ్ కేసులు పరిశీలించారు. స్టేషన్ పరి సరాలు పరిశుభ్రంగా ఉంచుకొని, స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా నడుచుకొని చట్ట పరిధిలో వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆస్తి కేసుల్లో రికవరీ శాతం పెంచాలన్నారు. గ్రామాల్లో గొడవలు, అల్లర్లు జరగకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, దీంతో పాటు సమస్యాత్మక గ్రామాల్లో నిఘా ఉంచాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. గోస్పాడు ఎస్సై సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక మాస హోమాలు



హోమాల్లో పాల్గొన్న భక్తులు

నంద్యాల కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల బాలాజీ కాంప్లెక్స్‌లోని కల్యాణమండపంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక హోమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మహానారాయణ, మహాశతరుద్రహోమం, మహాసంకల్పం, అగ్నిప్రాసన, సంస్కారం, లక్ష్మీగణపతి హోమం, అష్టగణపతి, నక్షత్ర, రుద్ర, మృత్యుంజయ హోమాలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, నారాయణ శ్రీనివాస్, దుద్దేల సురేష్‌బాబు, కొశెట్టి చంద్రశేఖర్,భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చానా దూరం

- రికార్డుల్లో లేని కుటుంబం
- ఆధార్, రేషన్, ఓటు హక్కుల్లేవు
- ఐటీడీఏ శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనం
- మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నివాసం



ప్రభుత్వ పథకాలు అందని చెంచు కుటుంబం

పాణ్యం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చెంచుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తోంది. అయితే అవి వారికి చేరడం లేదు. దీనికి నిలువెత్తు నిదర్శనమే ఈ కుటుంబం. ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్ లేని కుటుంబం ఉందంటే విచిత్రమే. ప్రభుత్వానికి సంబంధించిన ఏరికార్డుల్లోనూ లేని కుటుంబం ఉందంటే అతిశయోక్తే. ఈ కుటుంబం ఎక్కడో కొండల్లోనో, కోనల్లోనో నివసించడంలేదు. జాతీయ రహదారి పక్కన, అభివృద్ధి చెందుతున్న మేజర్ గ్రామ పంచాయతీ పాణ్యంలోని ఇందిరా కాలనీలో ఉండడం విచిత్రం. ఈకుటుంబంలో తొమ్మిది మంది సభ్యులున్నారు. వీరిలో తల్లిదండ్రులతో పాటు ఏడు మంది సంతానం. ఈ కుటుంబంలోని వ్యక్తులకు ఆధార్, రేషన్ కార్డుగానీ, ఇల్లుగానీ, సెల్‌ఫోన్, పన్నుగానీ, ఓటుహక్కు గానీ లేదంటే నమ్మశక్యం కాదు. కాలనీలో దాదాపు 300 కుటుంబాలు నివాసముంటున్నాయి. కాలనీకి చెందిన నిమ్మల ఈరయ్య, లక్ష్మి దంపతులకు ఏడుమంది సంతానం, వీరిలో ముగ్గురు కూతుర్లు, నలుగురు కుమారులు ఉన్నారు. వీరికి కనీసం ఇల్లు కూడాలేకపోవడంతో తన తల్లికి చెందిన స్థలంలో రేకులషెడ్డు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. నిత్యం వ్యవసాయ కూలీతో భార్యాబిడ్డలను పోషించుకుంటున్నాడు. వీరికి ఆధార్ కార్డు లేకపోవడంతో పిల్లలను అంగన్‌వాడి కేంద్రంలో చేర్చలేదు. రేషన్ కార్డు లేకపోవడంతో కూలీ డబ్బులతో అధిక ధర చెల్లించి ఆహార సరుకులు కొనుగోలు చేస్తున్నారు. ఆధార్ లేకపోవడంతో ఓటుహక్కు కూడా లేదు. ఇల్లు లేకపోవడంతో పన్ను, విద్యుత్ బిల్లు గానీ లేదు. పిల్లలకు సరైన పోషకాహారం లేక బక్క చిక్కి రోగాల బారిన పడే పరిస్థితి ఏర్పడినట్లు తల్లిదండ్రులు వాపోయారు.

చెంచుల జీవితాలను అభివృద్ధి చేయాలి..

నిత్యం చెంచుల జీవితాలను అభివృద్ధి పర్చాల్సిన ఐటీడీఏ (సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (చెంచు)) సంస్థ చెంచుల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేయాల్సి ఉంది. గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు విద్య, ఆరోగ్యం, జీవనోపాధి తదితర మౌళిక సదుపాయాలు, సేవలు అందించాల్సింది దీని ప్రధాన విధి. గిరిజనుల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థ. అడవుల్లో నివాసముంటున్న చెంచులను గుర్తించి వారిని ఒక చోట చేర్చి వారి అభివృద్ధికి నిధులు కేటాయించి వారి అభివృద్ధికి కృషి చేయాల్సిఉండగా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు గిరిజనులను నిర్లక్షంచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మౌలిక వసతులు మెరుగుపరచండి

- ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ రమేష్‌నాయుడు

శ్రీశైలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేవస్థానం అధికారులు సిబ్బందికి కేటాయించేందుకు సుండిపెంటలో నిర్మించిన బహుళ అంతస్థుల వసతి గదుల భవనంలో చేపడుతున్న మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తూ పనులు వేగవంతం చేయాలని ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు ఇంజనీరింగ్ అధికారులకు సూచనలిచ్చారు. గురువారం వసతిగదులను పరిశీలించి అధికారులతో ప్లాన్ వివరాలను తెలుసుకున్నారు. మార్పు చేర్పులు చేయడంతో నివాసితులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. అదే విధంగా సిబ్బందికి గదుల కేటాయింపును లాటరీ పద్ధతిలో చేపడుతామని, దీంతో అందరికీ సమన్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి: ఎస్పీ



కోవెలకుంట్ల పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

కోవెలకుంట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్ ఆవరణలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ సూచించారు. గురువారం రాత్రి మండలంలోని రేవనూరు, కోవెలకుంట్ల పోలీసు స్టేషన్లను ఆయన తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చిన ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట సీఐ హనుమంతనాయక్, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, పోలీసులు ఉన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో డీఈవో జనార్దన్‌రెడ్డి

రుద్రవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం రుద్రవరం మండలంలోని కోటకొండ, యల్లావత్తుల, పెద్దకంబలూరు పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. యల్లావత్తుల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తిని రుచి చూశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై చర్చించారు. ఆయన వెంట హెచ్‌ఎంలు బాల గురప్ప, బాలక్రిష్ణ, తిరుపతయ్య ఉన్నారు.

సేవలను ప్రజలకు చేరవేయండి

సంజామల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల సేవలు ప్రజలకు చేరవేయాలని డీఎల్‌డీవో శివారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని కమలపురి గ్రామంలో జరుగుతున్న సౌమిత్వ గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం సంజామల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాల్మన్‌తో కలిసి పంచాయితీ కార్యదర్శులు డిజిటల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ఏర్పాటైన సమా వేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సచివాలయ ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రతి మం డలానికి ఒక సచివాలయ ప్రత్యేక అధికారిని నియమించామన్నారు.

సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

డోన్ రూరల్ నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణ సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులుగా మాణిక్యం శెట్టి, శివరామ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో సీఐటీయూ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సభలో ఎన్నుకున్న నూతన కమిటీలో మాణిక్యం శెట్టి, శివరామ్‌లను అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. వీరి ఎన్నికపై సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

డోన్ టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ఉల్లాస్ - అక్షర ఆంధ్ర కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 'ఉల్లాస్ - అక్షర ఆంధ్ర'లో భాగంగా సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యసన, అవగాహన కల్పించేందుకు వలంటీర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమం నంద్యాల జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ అధ్యక్షత జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ పట్టణంలోని నిరక్షరాస్యులను గుర్తించి ప్రతి రోజు సాయంత్రం ఒక గంట పాటు వారికి చదువు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫయాజ్, మెప్మా సీఎంఎం సుజాత, సీవో సువర్ణ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించండి

దొర్నిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో సావిత్రి అన్నారు. గురువారం మండలంలోని గుండుపాపల, డబ్ల్యూగోవిందిన్నె, డబ్ల్యూకొత్తపల్లె, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె గ్రామ సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో నీటి పన్ను, కొళాయి పన్ను సంబంధిత అధికారులు ప్రజల నుంచి వసూలు చేసేలా చూడాలన్నారు. ఈవోపీఆర్డీ శివప్రసాదు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సామూహిక భగవద్గీత పారాయణం

బేతంచెర్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని బేతంచెర్ల పట్టణంలో గౌరిపేటలో ఉన్న పూదోట మఠంలో సామూ హిక భగవద్గీత పారాయణం గురువారం ప్రారంభమైంది. డిసెంబరు 1న గీతా జయంతి సందర్భంగా ఈ నెల 31 వరకు సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహిస్తామని పూదోట మఠం నిర్వాహకులు గుండా గోపాల్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అఖండ పారాయణం జరుగుతుందన్నారు. డిసెంబరు 1న గీతా జయంతి సందర్భంగా ఉదయం 10 నుంచి పూదోట మఠం నుంచి గీతా సహిత శ్రీకృష్ణ భగవానుని గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

చాగలమర్రి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈవో న్యామతుల్ల అన్నారు. గురువారం చాగలమర్రి గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

సదరం స్లాట్ బుకింగ్ చేసుకోండి

కొలిమిగుండ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో అర్హత కలిగిన దివ్యాంగులు సదరం స్లాట్ బుకింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో దస్తగిరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి సూచించారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం శుక్రవారం నుంచి సదరం క్యాంపు నిర్వహణకు సంబంధించి స్లాట్ బుకింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేయండి

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మేము ఊర్లో లేని సమయంలో మీడియా ముందుకొచ్చి వైసీపీ నాయకులు అనవసరమైన ప్రేలాపణలు చేస్తున్నారని, వాటిని మానుకొని ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హితవు పలికారు. గురువారం స్థానిక శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలో నూతనంగా ఎంపికైన మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. ముందుగా టీడీపీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఎన్టీ రామారావు, భూమా నాగిరెడ్డి, భూమా శోభానాగిరెడ్డి దంపతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఢిల్లీ జరిగిన బాంబు పేలుడులో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఒక్క నిమిషం మౌనం పాటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డ తాలుకాలో ఇచ్చిన మాటా ప్రకారం 5 వేల ఉద్యోగాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఎవరికి పదవులు వచ్చిన రాకపోయిన ఎవరూ నిరాశ పడకూడదని, పార్టీలో అందరూ సమానమేనని అన్నారు. కార్యక్రమంలో తాలుకా యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు పవన్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్లు శీలం హరికుమార్‌రెడ్డి, లాయర్ నరసింహారెడ్డి, రంగనాయకులు, బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అనంత రామసుబ్బారెడ్డి , వివిధ మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే: ఆళ్లగడ్డ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గురువారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు వార్డులలో తిరిగి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ సుజాతతో ఆసుపత్రిలో ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు.

పార్టీని బలోపేతం చేయండి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

బనగానపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, నియోజకవర్గం టీడీపీ పరిశీలకుడు నటేశ్ చౌదరి అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలో నూతనంగా ఎంపికైన మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారాన్ని మల్లెల రాజశేఖర్‌గౌడ్, సీనియర్ టీడీపీ నాయకులు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లెళ్ల రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లెల్ల రాజశేఖర్‌రెడ్డి, మల్లెల రాజశేఖర్‌గౌడ్‌లు పార్టీ జెండాను ఆవిష్క రించి మాట్లాడారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు టీడీపీ అండగా ఉం టుందన్నారు. ఈసందర్భంగా బనగానపల్లె మండల టీడీపీ అధ్యక్షుడిగా పీవీ.కుమార్‌రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా కాశీంబాబు, అవుకు మండల టీడీపీ అధ్యక్షుడిగా ఉగ్రసేనా రెడ్డి, కొలిమిగుండ్ల మండల టీడీపీ అధ్యక్షుడిగా మూలే రామేశ్వరరెడ్డి, సంజామల టీడీపీ అధ్యక్షుడిగా ఎగ్గోనికి చెందిన తరి పోగుల విష్ణువర్దన్‌రెడ్డి, కోవె లకుంట్ల మండల టీడీపీ అధ్యక్షుడిగా అమడాల మద్దిలేటి, తదితర క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ స్థాయి కమిటీ సభ్యులచే జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గం పరిశీలకులు నటేశ్ చౌదరి ప్రమాణ స్వీకారం చేయిచారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కుడు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, అమర్‌నాథరెడ్డి, ఉపసర్పంచ్ బురా నుద్దీన్, గండం మల్లికార్జునరెడ్డి, మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి, అబ్దుల్‌కలాం, రాయల సీమ సలాం, బెలుం సురేశ్‌రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, అంకిరెడ్డిపల్లె రవిప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.



క్లస్టర్, యూనిట్, బూత్, కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మల్లెల

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



చెక్కును అందజేస్తు ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయ నిధి పథకం ద్వారా భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.34,19,232 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్రగౌడు, మండల అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, బేతంచెర్ల మండల అధ్యక్షుడు ఎల్ల నాగయ్య, బుగ్గన ప్రసన్నలక్ష్మి, మహ్మద్ రఫీ, మిద్దెపల్లె గోవిందు, తిరుమలేష్ చౌదరి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కోట్ల రాక

ప్యాపిలి: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి శుక్రవారం ప్యాపిలి పట్టణానికి వస్తున్నట్లు గురువారం టీడీపీ వర్గాలు తెలిపాయి. స్థానిక ప్రభుత్వ విశ్రాంత భవనంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలకు సంబంధించి ఎమ్మెల్యేకు వినతులు ఇవ్వాల్సింగా పార్టీ వర్గాలు కోరాయి.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

శిరివెళ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శిరివెళ్లలోని గ్రంథాలయంలో శుక్రవా రం నుంచి ఈనెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తు న్నట్లు లైబ్రేరియన్ సుజాత గురువారం తెలిపారు. పుస్తక ప్రదర్శనతోపాటు వివిధ అంశాల్లో విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, క్రీడలు తదితర వాటిని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

దొర్నిపాడు: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి అఖిలబేగం కోరారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు.

కొలిమిగుండ్ల: మండలకేంద్రమైన కొలిమిగుండ్లలోని ప్రభుత్వ గ్రంథాలయంలో శుక్రవారం నుంచి 58 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు లైబ్రరీయన్ రాజామనోహర్ గురువారం తెలిపారు. వారం రోజుల పాటు గ్రంథాలయంలో వివిధ కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వీడాలి



ప్రజలతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో రాంబాబు

ఉయ్యాలవాడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తను సేకరించ డంలో నిర్లక్ష్యం వీడి పనిచేయాలని డీఎల్‌పీవో రాంబాబు తెలిపారు. గురువారం మండలంలోని బోడెమ్మనూరు, మాయలూరు గ్రామాల్లో ఎంపీడీవో ఉమామహేశ్వరరావుతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణపై ప్రజలను అడిగి తెలుసుకు న్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌లో ఈ రెండు గ్రామాల్లో తక్కువ శాతం నమోదైందని, అందువల్ల గ్రామాలను సందర్శించి వివరాలు తెలసుకున్నామని అన్నారు. డిప్యూటీ ఎంపీడీవో నాగలక్ష్మి, గ్రామ కార్యదర్శి ఉన్నారు.

జిల్లాలో 340 చెత్త సంపద కేంద్రాలు

చాగలమర్రి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పరిధిలోని 28 మండలాల్లో 340 చెత్త సంపద కేంద్రాలు ఉన్నట్లు డీఎల్పీవో రాంబాబు తెలిపారు. గురువారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులచే సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలను నిర్వహించి సంపద సృష్టించాలని సూచించారు. తడిచెత్త, పొడి చెత్త వేరు చేయాలని అన్నారు. ఇంటింటికి వెళ్లి గ్రీన్ అంబాసిడర్లచే చెత్త సేకరణ చేయించాలన్నారు. జిల్లాలో రూ.10 కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉందన్నారు. అనంతరం గొడిగనూరు గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఈవో తారకేశ్వరి, రిసోర్స్‌పర్సన్ దస్తగిరి బాషా పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఉయ్యాలవాడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. గురువారం మండలంలోని పుచ్చకాయలపల్లె గ్రామంలోని కస్తూర్బా బాలికల పాఠశాల లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో ఉమామహేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. నూతనంగా నిర్మించిన భవనాలను సందర్శించారు. పాఠశాలలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎస్‌వో అంజనమ్మ అధికారులను కోరారు. వీరి వెంట ఎంఈవో2 ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో నాగలక్ష్మి ఉన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

చాగలమర్రి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు కోరారు. గురువారం చాగలమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు నాగమణి, పద్మ, రజిని, ఆశా వర్కర్ల యూనియన్ సభ్యులు లక్ష్మీదేవి, శివలక్ష్మి పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

బేతంచెర్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చట్ల మల్లికార్జున స్వామి కోనేరు వద్ద వ్యక్తి గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. ఆలయ పూజారి, పోలీసులు తెలిపిన వివరాల మేరకు రంగాపురం గ్రామానికి చెందిన మనోహర్ (45) కార్తీకమాసం కావడంతో ప్రతి రోజు ముచ్చట్ల క్షేత్రంలో స్నానం చేసి పూజలు చేసేవాడని, గురువారం సాయం త్రం వచ్చి కోనేరులో స్నానం చేసి మెట్లపై స్పృహ తప్పి పడిపోయాడని తెలి పారు. ఈ విషయాన్ని అయ్యప్పస్వామి భక్తులు తెలపడంతో అక్కడికి వెళ్లి చూడగా. అప్పటికే మృతి చెందాడనీ వారు తెలిపారు. బేతంచెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి..

రుద్రవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలదిన్నెకు చెందిన వెంకటసుబ్బయ్య (72) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ మహ్మద్‌రఫి తెలి పారు. ఈనెల 12న ఇంట్లో బీడీ తాగి పక్కన పడేయడంతో మంటలు చెలరేగి ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. గాయపడిన వృద్ధుడిని ఆళ్లగడ్డ, నంద్యాల ప్రభు త్వాసుపత్రులకు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి కుమారుడు హుసేనయ్యశెట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతులను పీడిస్తున్న వీఆర్వోలు

మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ ధ్వజం



మాట్లాడుతున్న సర్పంచ్ దశరథరామిరెడ్డి

డోన్ రూరల్ నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చిన రైతులను వీఆర్వోలు డబ్బు కోసం పీడిస్తున్నారని గుమ్మకొండ గ్రామ సర్పంచ్ దశరథరామిరెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ అతిథి గృహం ప్రాంగణంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయం తరపున డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూండగా.. గుమ్మకొండ గ్రామ సర్పంచ్ దశరథరామిరెడ్డి తీవ్రంగా స్పందించారు. డోన్ రెవెన్యూ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులదే రాజ్యం నడుస్తుందని ఆరోపించారు. మోటివేషన్ల పేరుతో కొంత మంది వీఆర్వోలు, రైతుల నుంచి లంచాలు తీసుకుంటూ రైతులకు దగా చేస్తున్నారని విమర్శించారు. అలాగే చిన్నమల్కాపురం పీహెచ్‌సీ వైద్యులు మాట్లాడుతుండగా.. సర్పంచ్ దశరథరామిరెడ్డి కల్పించుకుని గ్రామాల నుంచి డోన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వస్తున్న గర్భిణులకు కాన్పులకు వైద్యులు ప్రైవేటు ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారన్నారు. వీరిపై డీఎంహెచ్‌వో సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎంపీపీ డీఎంహెచ్‌వోకు తీర్మాణం చేసి పంపడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలని, అవి కూడా మేమే గుర్తు చేయాలా అని అసహనం వ్యక్తం చేశారు. ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి మాట్లాడుతూ రైతులు ఉద్యాన ఉత్పత్తుల కేంద్రం, సోలార్ డ్రేయర్, కోల్డ్ స్టోరేజీలను నిర్మించుకోవాలని కోరారు. ఈసమావేశంలో జడ్పీటీసీ సభ్యులు బద్దల రాజ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, ఎంఈవో ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శేఖర్, మండల ఏఈ నారాయణ, ట్రాన్స్‌కో ఏఈ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలబిళం తిరునాల ఏర్పాట్ల పరిశీలన



వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలబిళం మల్లేశ్వరస్వామి సన్నిధిలో కార్తీక సోమవారం జరిగే తిరునాల ఏర్పాట్లను కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు పరిశీలించారు. గురువారం ఆలయ కమిటీ గ్రామ పెద్దలతో కలిసి ఆలయ ప్రాంగణంలో పర్యటించారు. ఈ సందర్భంగా వాహనాల పార్కింగ్ భక్తుల క్యూలైన్లు, అన్నదానం నిర్వహించే పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

కుష్ఠు వ్యాధి ప్రాణాంతకం కాదు

చాగలమర్రి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి ప్రాణాంతకం కాదని నోడల్ పర్సన్ రామలింగారెడ్డి అన్నారు. గురువారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టర్లను వైద్యులు అంజలి ఆధ్వర్యంలో విడుదల చేశారు.

తూకాల్లో తేడా వస్తే చర్యలు

ప్యాపిలి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తూకాల్లో తేడా వస్తే చర్యలు తప్పవని తహసీల్దారు భారతి హెచ్చరిం చారు. గురువారం పట్టణంలోని పలు రేషన్ దుకాణా లను ఆమె తనిఖీ చేశారు.

లింగ వివక్షతను నిర్మూలిద్దాం

బనగానపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): లింగ వివక్షతను నిర్మూలిద్దామని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. గురువారం మండలంలోని చెర్వుపల్లె గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, మహిళలకు లింగ వివక్షతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చూడాలన్నారు. అనంతరం తల్లులు, గర్భిణులకు ప్రోత్సాహక బహుమ తులు అందించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భారతి, అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి, మాబి, రాజు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాటం

బనగానపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల కోసం పోరాడతామని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శి లక్ష్మీదేవి, రజిత అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఆడపిల్లలపైన అత్యా చారాలు పెరిగిపోయాయన్నారు. అనంతరం బనగానపల్లె మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా ఏలేశ్వరమ్మ, కార్యదర్శిగా స్వరూపతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించండి

కోవెలకుంట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే స్వామిత్వ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డోన్ డీఎల్‌డీఓ నరసింహారెడ్డి సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని పెద్దకొప్పెర్ల గ్రామంలో జరిగే స్వామిత్వ సర్వేను డోన్ డీఎల్‌డీవో నరసింహారెడ్డి, ఎంపీడీవో వర ప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు కలిసి తనిఖీ చేశారు.

పెరిగిన చలి తీవ్రత

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు



చాగలమర్రి హైవే రహదారిలో మంచులో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనం

చాగలమర్రి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో క్రమంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరుగుతోంది. సాధారణంగా అక్టోబరు రెండో వారం నుంచి శీతాకాల వాతావరణం కనిపిస్తుంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తాయి. ఈ ఏడాది అధిక వర్షాలతో శీతాకాలం కాస్త ఆలస్యమైంది. ప్రస్తుతం రెండు రోజులుగా రాత్రి వేళ చలి ఉధృతి కనిపిస్తోంది. ఉదయం, రాత్రి వేళలో మంచు కురుస్తోంది. దీంతో గ్రామాల ప్రజలు పక్కన పెట్టిన రగ్గులు, ఉల్లి దుస్తులను బయటకు తీసి ధరించుకుంటున్నారు.

విచారణకు ప్రత్యేక బృందం

డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రుద్రవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో 'రూ.2.72 కోట్లు గోల్‌మాల్' అనే కథనం ఆంధ్రజ్యోతిలో అక్టోబరు 28న ప్రచురి తమైంది. కలెక్టరు రాజకుమారి గనియా స్పందించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డిని విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు గురువా రం రుద్రవరం వెలుగు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. నిధులు గోల్‌మాల్ విచారణకు ఏపీఎం శ్రీనిధి నాగప్రసాద్, డీపీఎం ఐబీనాయక్‌ను నియమించామన్నారు. విచారించి పూర్తిస్థాయి నివేదికను ఇవ్వాలని బృందం సభ్యులను ఆదేశించామని తెలిపారు. ఏపీఎం వసంతకుమారి ఉన్నారు.

వాహనాల తనిఖీ

సంజామల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిగేడు క్రాస్ రోడ్డులో ఎస్‌ఐ రమణయ్య గురువారం వాహనాలను తనిఖీ చేశారు. రూట్ పర్మిట్, లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర ధృవపత్రాలు లేని వాహ నాలను ఆపి జరిమానా విధించారు.

కోవెలకుంట్ల: వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పక లైసెన్స్ కలిగి ఉండాలని సీఐ హనుమంతనాయక్ అన్నారు. గురువారం ముదిగేడు వెళ్లే రహదారిలో సీఐ వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు, లైసెన్సు సరిగా లేని వాహనాలకు జరిమానా విధిం చారు. అనంతరం సీఐ మాట్లాడుతూ డ్రైవర్లు తప్పని సరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు.

దివ్యాంగుల చైర్మన్‌ను కలిసిన రమేష్‌చౌదరి



చైర్మన్‌ను సన్మానిస్తున్న కాకర్ల రమేష్‌చౌదరి

దొర్నిపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్రారెడ్డిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, న్యాయవాది కాకర్ల రమేష్‌చౌదరి గురువారం విజయవాడలో రాష్ట్ర దివ్యాంగుల చైర్మన్ నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ నారాయణ మాట్లాడుతూ నేటి నుంచి దివ్యాంగులకు సదరన్ క్యాంపులను ఏర్పాటు చేస్తామన్నారు. దొర్నిపాడు మండలంలో అర్హత కలిగిన దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరామని రమేష్ చౌదరి తెలిపారు. ఈయన వెంట టీడీపీ నాయకులు కాకర్ల శ్రీను, రాజేష్ ఉన్నారు.